# తెలివిమీరిన లోకంలో...

తెలివిమీరిన ప్రపంచంలో తెరువుల తీరులు ఒక్కొక్కప్పుడు చాలా విచిత్రంగా కన్పిస్తాంటాయి. సభ్యత అనేది ఈ తెరువులను తీర్చి దిద్దుతూంటుందనే నమ్మకమొకటి చాలామందిలో వేళ్లు పాతుకునివుంది. ఇద్దరువ్యక్తులు కలుసుకుంటే అభిమానం పొలికేట్టుగా, చేతులు నొప్పి పుట్టేట్టుగా, మేకులు గుచ్చుకున్నట్టుగా కరస్పర్శ, లేకపోతే నమస్కార శతాలు, 'రాంరాం'లు, వెకిలినవ్వులు విరగబాట్లు, ఆనందం పట్టజాలక పోయినట్టు, హిస్టీరియా వచ్చినట్టు ప్రవర్తించడం-యిదంతా సభ్యతాయుత జీవనం క్రిందనే పరిగణించాల్సి వస్తూంది. కాని, మనం నేర్చుకున్న, సానిపాపకుమల్లే దిద్ది, తీర్చుకున్న—కొన్ని అలవాట్లను కొన్ని సంఘ మర్యాదలను సునిశితంగా పరిశీలించిచూస్తే వాటిలో ఎంత కుళ్లు, ఎంత అసభ్యత, ఎంత కృత్రిమ వాతావరణం నిండివుందో తెలియ వస్తుంది—

ఇది నిజంగా జరిగింది-ఒకానొక హాలీవుడ్ ఫిలింలో ఒక కోటీశు తనయయొక్క పుట్టినరోజు ఆనాడు. ఏతత్కారణంగా ఒక బ్రహ్మాండమైన విందు ఏర్పాటుచేసింది ఆమె. విందుకు మిత్రులు, పరిచయస్థులూ, పత్రికా ప్రతినిధులూ వచ్చేవేళకు డిన్నరుహాలులో జరగవలసిన ఏర్పాట్లన్నీ వైభవోపేతంగా జరిగినాయి. ఆ కోటీశుతనయ-అపరూప సుందరి-మాంచి ఘుమాయింపుమీద వున్న వయసుతో, ఆరోగ్యంతో, ఛలాకీతో, ప్రవేశద్వారంవద్ద అపర జగన్మోహినిలా నించుని వచ్చేవారినందర్నీ చిరునగవు చిందులాడే వదనంతో ఆహ్వానిస్తూంది.

అంతలో వచ్చాడొకాయన. ఆయన ఆహ్వానింపబడ్డవాళ్ల జాబితాలో చేరాడో లేదో ఎవరికీ తెలీదు. ఆయన నూటికి నూరుపాళ్ళు యథార్థవాది. ఆయనకు కావలసింది నిండైన భోజనం-ఈ భేషజాలతో ఆయనకేమీ నిమిత్తంలేదు.

డిన్నరు టేబిలువద్దకు దూసుకు వెళుతోన్న ఈ పెద్దమనిషిని నిలేసి ఆపింది ఆ ప్రవేశద్వారంవద్ద నున్న దేవతా విగ్రహం. 'మిమ్మల్ని కలుసుకుంటుకు చాలా సంతోషంగా వుంది,' అని ఆయన చెయ్యిపట్టుకుని అలవాటు ప్రకారం నొక్కింది.

అదివరకు అనేకమంది పెద్దపెద్దలు ఆ కరస్పర్శకు లోలోపల చొక్కి, తమతమ ఆనందాన్ని ముఖంలో విరజిమ్ముకుని డిన్నరు టేబిలు వైపు దారితీసి వున్నారు. కాని, ఇతగాడుమాత్రం అలా వెళ్లకుండా ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ 'మేడం!' అన్నాడు, హాలంతా ప్రతి ధ్వనించేటట్టు-

ఆమె తెల్లబోతూ అతడ్ని గమనించింది-

ఆతడు ముఖం జేవురించుకుని 'ఇదుగో ఇటు చూడూ, నేను నిన్ను ఎరగను, నన్ను నువ్వెరగవు - నా చెయ్యి స్పృశించినంతమాత్రాన నీ కెలాగ సంతోషం కలిగిందో నా కర్థమవటంలేదు - నా విషయమే చూడు-నువ్వు నా చెయ్యి పట్టుకున్నంతమాత్రాన నాకేమీ సంతోషం ఉట్టిపడలేదు-మనకి సంతోషాన్ని తెచ్చిపెట్టే, పురికొల్పే సన్నివేశాలు ఇంత చప్పగా, ఇంత కృత్రిమంగా వుండవు-ఇంకా కడుపునిండా విందైనా ఆరగించలేదు. ఒక్కగ్లాసు విస్కీ అయినా త్రాగలేదు, ఒక్క స్త్రీతోనైనా డ్యాన్సు చేయలేదు-ఒకామెనైనా దగ్గరకు-ఈ విశాలవక్షందగ్గరకు-తీసుకుని ముద్దుపెట్టుకోలేదు-ఈ పరిస్థితులలో నీకేం సంతోషమో దేవుడెరుగు కాని, నాకేమీ సంతోషం, తృప్తికలగలేదు-డిన్నరయ్యాక మళ్ళీ కలుసుకుని మాట్లాడుకుందాం-' అని ఆకలిగొన్న పులిలా గుడ్లురుముతూ డిన్నరు టేబిలువద్దకు లంఘించాడు.

'మోటుమనిషి! సభ్యతలేనిమనిషి! అనాగరికుడు...' ఇటువంటి మాటలు వెలువడినై అతడ్నిగురించి, సభ్యతను భోంచేసిన పెద్ద పెద్దల వద్దనుంచి!

కాని, 'ఇటువంటి 'విప్లవకారుల' వద్దనుంచి ప్రపంచం పొందవలసిన

లాభదాయకమైన సందేశాలేవైనా వుంటాయి' అనే భావం ఆ చిత్రం చూడటం మన చెవులో హోరుపెడుతూనే వుంటుంది.

పరిశీలనగా చూస్తే నిత్యజీవితంలో ఇటువంటి కృత్రిమవాతావరణం, దానిలో మునిగి తేలుతూండే 'జపాను బొమ్మల' కూటం సాధారణంగా కనిపిస్తూనే వుంటుంది. ఈ ఆర్భాటాల కేమన్నా ప్రయోజనం వున్నదా, ఈ అర్థంలేని, ఫలంలేని విరగబాటెందుకయ్యా అంటే—

జీవితం రాణించాలంటే ఇది అవసరం. ఈ పగటి వేషాలు మనం ధరించాలి-ప్రతిఫలం కోరని చేష్టలను చేస్తూండాలి-బొడ్డు దగ్గర్నుంచి రాని సంతోషాన్ని ముఖంలో కృత్రిమంగా తెచ్చి పెట్టుకోవాలి అంటూంటూరు మహానుభావులు.

నేను మాత్రం 'గండ్ర గొడ్డలి తీసుకుని వీటన్నిటినీ చావమోదాలి' అంటాను. నిష్కారణంగా రోజుకు పదిసార్లు 'గుడ్‌మార్నింగ్'లూ 'గుడ్ ఈవినింగు'లూ కొట్టేవాడినీ, కనిపించినప్పుడల్లా 'రాంరాం' అనేవాడినీ, మన అప్పులు తీర్చడానికి పూచీ వహించకపోయినా మన అప్పుల ప్రసక్తి ఎత్తేవాడినీ, మన కష్టసుఖాలు భాగించుకోడానికి ఇష్టపడకపోయినా 'అంతా కుశలమేగదా!' అని వెకిలినవ్వు నవ్వి వెళ్ళిపోయేవాడినీ కిరసనాయిలుపోసి అంటించమంటాను. ఇటువంటివాళ్లు వృద్ధి అవుతూన్న కొద్దీ సంఘంలో కుళ్లు ఇలా పెరుగుతూనే వుంటుంది.